



మోగిన నగారా..

అంతా ఆసక్తిగా.. ఎదురు చూస్తున్న పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఎట్టకేలకు విడుదలయ్యింది. దీంతో పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పంచాయతీల వారీ గా సర్పంచ్, వార్డు మెంబర్ రిజర్వేషన్లు, ఓటరు జాబితాలను ఫైనల్ చేశారు. జిల్లాలో 473 సర్పంచ్ స్థానాలతో పాటు 3,870 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

- ఎట్టకేలకు పంచాయతీ ఎన్నికల షెడ్యుల్ విడుదల
- డిసెంబరు 11, 14, 17వ తేదీల్లో మూడు విడతల్లో ఎన్నికలు
- రేపటి నుంచే మొదటి విడత నామినేషన్లు, తక్షణమే అమల్లోకి ఎన్నికల కోడ్
- ప్రధాన పార్టీల మద్దతు కోసం నేతల ప్రయత్నాలు
- గ్రామాల్లో మొదలైన పంచాయతీ ఎన్నికల పోరు

ఆదిలాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంతా ఉత్కంఠగా ఎదురుచూసిన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆశావహ నేతలు మరింత స్పీడును పెంచుతున్నారు. ఆర్థిక స్థోమత, ప్రజాబలం, తమకున్న పరియాలతో నేతలంతా సర్పంచ్ బరిలో దిగేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ముఖ్యంగా ప్రధాన పార్టీలలో నువ్వా? నేనా? అన్నట్లుగా పోటాపోటీ కనిపిస్తుంది. పోటీ చేసేవారంతా ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు వివిధ రకాల హామీలు, విందు రాజకీయాలతో ప్రయత్నాలు మొదలు పెట్టారు. తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. దీంతో అధికారిక కార్యక్రమాలన్ని పూర్తిగా నిలిచిపోనున్నాయి.

మూడు విడతల్లో ఎన్నికలు

పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ మంగళవారం షెడ్యుల్‌ను విడుదల చేసింది. డిసెంబరు 11, 14, 17వ తేదీల్లో మూడు విడతల్లో ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపును నిర్వహించి సర్పంచ్, వార్డు సభ్యుల ఫలితాలను ప్రకటిస్తారు. మొదటి విడత నామినేషన్లు నవంబరు 27 నుంచి స్వీకరిస్తారు. అలాగే రెండవ విడత నవంబరు 30, మూడవ విడత డిసెంబరు 3 నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. ఇప్పటికే అధికారులు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. మండలాల వారీగా ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. పోలింగ్ చీటీలు, బ్యాలెట్ బాక్సులను సరఫరా చేశారు. అలాగే పీవోస్, ఏపీఓస్, పోలింగ్ సిబ్బందికి శిక్షణను పూర్తి చేశారు. మొదట పంచాయతీ ఎన్నికలను నిర్వహించి ఆ తర్వాత పరిషత్ ఎన్నికలను నిర్వహించాలని -మిగతా 6లో

జిల్లాలో మొత్తం గ్రామ పంచాయతీలు	473
మొత్తంవార్డుల సంఖ్య	3870
మొత్తం ఓటర్లు	4లక్షల 47వేల 135
మహిళ ఓటర్లు	2లక్షల 28వేల 436
పురుష ఓటర్లు	2లక్షల 18వేల 683
ఇతరులు	16 మంది

మొదటి విడత డిసెంబరు 11వ తేదీ

రెండవ విడత డిసెంబరు 14వ తేదీ

మూడవ విడత డిసెంబరు 17వ తేదీ

మొదటి విడత నామినేషన్లు నవంబరు 27 నుంచి 29 వరకు (ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు)

రెండవ విడత నామినేషన్లు నవంబరు 30 నుంచి డిసెంబరు 2 వరకు (ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు)

మూడవ విడత నామినేషన్లు డిసెంబరు 3 నుంచి డిసెంబరు 5 వరకు (ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు)

వైద్యుల నిర్లక్ష్యంపై..
మానవ హక్కుల కమిషన్ సీరియస్

- గుడిహత్నూర్ ఆసుపత్రి ఘటనపై సీఎస్‌ను వివరణ కోరిన కమిషన్
- బాధిత కుటుంబానికి రూ.50 వేల నష్ట పరిహారం అందించాలని ఆదేశం

ఆదిలాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత జూన్22న రెండు రోజుల వయస్సు గల శిశువుపై సీలింగ్ ఫ్యాన్ తెగిపడిన ఘటనను రాష్ట్ర మానవహక్కుల కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రెండు రోజుల శిశువుపై తెగిపడిన సీలింగ్ ఫ్యాన్' అనే కథనాన్ని రాష్ట్ర మానవహక్కుల కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తార్ తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనకు బాధ్యులైన వైద్యుల నిర్లక్ష్యాన్ని తప్పుబడుతూ కమిషన్ సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేసింది. విచారణ నివేదికను పరిశీలించిన కమిషన్ ఈ నెల 7న ఉత్తర్వులను జారీ చేసింది. ఈ ఘటన ప్రభుత్వ ఆరోగ్య సంస్థల నిర్వాహణలో తీవ్ర నిర్లక్ష్యం, రోగుల భద్రతను ఉల్లంఘించారని సూచించింది. ఫ్యాన్ తెగిపడిన కారణంగా శిశువు తలపై గాయం కావడంతో పాటు తీవ్ర అస్వస్థతకు గురైనట్లు తెలిపింది. అలాగే కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న మానసిక ఆందోళనను పరిగణలోకి తీసుకుంది. బాధిత కుటుంబానికి రూ.50 వేల నష్ట పరిహారంను శిశువు తల్లి అయిన గుడిహత్నూర్ మండలం కొద్దుగూడ గ్రామానికి చెందిన పాయల్‌జాదవ్‌కు చెల్లించాలని ఆదేశించింది.మానవహక్కుల పరిరక్షణ చట్టం 1993 సెక్షన్ 18(ఇ) ప్రకారం రెండు నెలల్లో నివేదికను రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌కు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం



విద్యార్థుల సమస్యలను తెలుసుకుని నచ్చజెప్పుతున్న పోలీసులు

మాకొద్దు.. ఈ ప్రిన్సిపాల్

- ఇచ్చోడలో 'జ్యోతిబా పూలే' విద్యార్థుల ఆందోళన

7లో

తగ్గిన పత్తి మద్దతు ధర : మార్కెట్ కమిటీ ఏడీ

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సీసీఐ నాణ్యత ప్రమాణాల ప్రకారం పత్తి పింజ పొడవు తక్కువగా వస్తున్నందున మద్దతు ధరలో రూ.50 తగ్గిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏడీ గజానన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా దిలాబాద్ మార్కెట్ యార్డుకు వస్తున్న పత్తి నమూనాలను పరీక్షించగా.. పత్తి పింజ పొడవు తక్కువగా వస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగానే మద్ధతు ధరను తగ్గిస్తున్నట్లు తెలిపారు. రంగు మారిన పత్తిని, కౌడి పత్తిని మంచి పత్తిలో కలపవద్దని, ఇంటి వద్దనే ఆర బెట్టుకుని మద్దతు ధర పొందాలని ఆయన పేర్కొన్నారు.



ఓటు హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థులు

ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం : ఎంపీడీవో

బోథ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధమని, ఓట్ల ద్వారా పాలకులను ఎన్నుకుంటారని ఓటుకున్న విలువ గురించి ఎంపీడీవో రమేష్, ఎస్సై శ్రీసాయిలు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓటు వేసి వారి వారి తరగతుల లీడర్లను ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఖాతాదారుల సమావేశం

ఉట్నూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో గురువారం ఈపీఎఫ్ ఖాతా చందాదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కరీంనగర్ నుంచి ఈపీఎఫ్‌వో అమిత్‌కాజ, ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ ఎన్.శ్రీధర్‌లు హాజరై ఈపీఎఫ్ చందాదారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నందున, ఖాతాదారులు హాజరు కావాలని బొంకంటి సుభాష్ కోరారు.

ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయండి

బోథ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నాపూర్ గ్రామ ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్‌కు పాట్నాపూర్ గ్రామస్థులు విన్నవించారు. మంగళవారం గ్రామానికి చెందిన న్యాయవాది పి.శంకర్ ఆధ్వర్యంలో ఉట్నూర్‌కి వెళ్లి పీవోకు సమస్యలను విన్నవించారు. ఇంగ్లీష్ సాంఘీక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు లేక పోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాని పీఓ దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాక ఆదవాసీ రైతులకు అవసరమైన త్రిఫేస్ కరెంట్ లైన్ కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్‌సిడాంరాం పాల్ ఆత్రంనాగర ఆడే భీమ్రావు, సిడం లక్ష్మణ్,కుమ్రన్ కిషన్ ఆడింతేరావు, తదితరులున్నారు.

29న తుకారాం వర్ధంతి

ఉట్నూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దివంగత ఐఏఎస్ అధికారి మడావి తుకారం 27వ వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 29న మండలంలోని లక్షెటిపేట, తుకారం ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహిస్తున్నందున కార్యక్రమానికి ఆదివాసులు హాజరై విజయవంతం చేయాలని మండలంలోని లక్షెటిపేట గ్రామపెద్దలు, మడావి తుకారాం యూత్ సభ్యులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్ వద్ద మనవి తుకారాం వర్ధంతి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్షెట్‌పేట రాయల్ సెంటర్ సార్ మేడి సలాం శ్యామ్‌రావు మాట్లాడుతూ యూత్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నుంచి లక్షెటిపేట గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని పలు అంశాలను వివరించారు.

మెరుగైన విద్య బోధన అందించాలి

- ఐటీడీఏ పీవో యువరాజ్‌మార్మాట్
- పలు ఆశ్రమ పాఠశాలల్లో విస్తృత తనిఖీలు

ఉట్నూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం మండలంలోని లక్షెటిపేట, ఎందా గిరిజన సంక్షేమ ఆశ్రమప రశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్లు, తరగతి గదులు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల కోసం తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతీరోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, విద్యార్థులకు అవసరమైన ఐరన్, సి విటమిన్ టాబ్లెట్లను అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వసతి గృహ పరిసరాలలో నిత్యం పారిశుద్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. చలి తీవ్రత ఎక్కువ ఉండడం వలన విద్యార్థులకు ఉదయం స్నానానికి వేడినీళ్లు అందుబాటులో ఉండే విధంగా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతీరోజు అన్నీ శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న పీవో యువరాజ్ మర్మాట్

2వ బెటాలియన్ కమాండెంట్‌గా పి.వెంకట్‌రాములు బాధ్యతల స్వీకరణ

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ వద్ద గల 2వ బెటాలియన్‌కు కమాండెంట్‌గా పి.వెంకట్‌రాములు మంగళవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ దళాల శిక్షణ, క్రమశిక్షణ, ప్రజా భద్రత మా ప్రాధాన్యత అన్నారు. బెటాలియన్ ప్రతిష్టను మరింతగా పెంచేలా సమిష్టిగా పని చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సీనియర్ అధికారులు, సిబ్బంది హాజరై కొత్త కమాండెంట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పి.వెంకట్‌రాములు ఇప్పటివరకు పోలీసు శాఖలో పలు కీలక బాధ్యతలు నిర్వహిస్తూ తన అనుభవం, నాయకత్వం బెటాలియన్ అభివృద్ధికి, దళాల సామర్థ్య వృద్ధికి ఎంతో తోడ్పడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బెటాలియన్ సిబ్బంది కొత్త కమాండెంట్‌కు అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న నూతన కమాండెంట్ పి.వెంకట్‌రాములు (ఇన్‌సెట్‌లో బాధ్యతలను స్వీకరిస్తున్న దృశ్య)

అర్జుని ఆశ్రమ బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ

నార్నూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్యబోధన అందించాలని జీసీడీవో మెస్రం ఛాయా సూచించారు. గాదిగూడ మండలంలోని అర్జుని ఆశ్రమ బాలికల, కొలంగూడ శాటిలైట్ సెంటర్ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్ లక్ష్యం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రధాన ఉపాధ్యాయుడు శాం పవార్‌తో కలిసి స్టోర్ రూమ్, వాటర్ ప్లాంట్, షిక్ రూమ్ పరిశీలించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సలహా ఇచ్చారు. విద్యార్థులు పట్ల నిర్లక్ష్యం చేయకూడదన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జీసీడీవో మెస్రం ఛాయా

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట బీసీ సంఘాల ఆధ్వర్యంలో బీసీ ధర్మ పోరాట దీక్షలు చేపట్టారు. ప్రభుత్వ తీరును ఎండగట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



దీక్షలో పాల్గొని నిరసన తెలుపుతున్న నేతలు

నేత్రపర్వంగా రుక్మిణీ, సత్యభామ సహిత
గోపాలకృష్ణుడి రథోత్సవం

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అతి పురాతన ఆలయాల్లో ఒకటైన రామచంద్ర గోపాలకృష్ణ మఠం వ్యవస్థాపకుడు పూర్ణానంద సరస్వతి పుణ్యతిథిని పురస్కరించుకుని.. జిల్లాకేంద్రంలో మంగళవారం నిర్వహించిన రుక్మిణి సత్యభామ సహిత గోపాలకృష్ణ రథోత్సవం నయనానందకరంగా సాగింది. ముందుగా మఠాధిపతి యోగానంద సరస్వతి వేదమంత్రోచ్ఛరణల నడుమ రథానికి పూజలు చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపి రథోత్సవాన్ని ప్రారంభించారు. చుట్టుపక్కల పల్లెలు, పట్టణంతో పాటు మహారాష్ట్ర నుంచి భారిగా తరలివచ్చిన భక్తులు పాల్గొనగా... భక్తిగీతాలు ఆలపిస్తూ, నృత్యాలు చేస్తూ అలరించారు. మహిళలు మంగళ హారతులతో పట్టణ పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. గోవింద నామస్మరణతో పట్టణ పుర వీధులు మారుమోగగా...భక్తజన సంద్రంతో రథోత్సవ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. అమావాస్య నుంచి పౌర్ణిమ వరకు పదిహేను రోజుల పాటు జాతర వేడుకలు కొనసాగనున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణం భక్త కోటితో కిక్కిరిసిపోయింది. అనంతరం భక్తులకు మహాన్నదానం ఏర్పాటు చేశారు. ఈ మేరకు మఠాధిపతి మాట్లాడుతూ.. గత నాలుగు రోజులుగా అశ్వ, గజ, హనుమత్, గరుడ వాహనాలతో రథోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పదిహేను రోజుల పాటు జాతర అంగరంగ వైభవంగా కొనసాగనుందని పేర్కొన్నారు.



రథానికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న మఠాధిపతి

స్వయం సహాయక సంఘాలు
ఆర్థికంగా బలోపేతం కావాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్
- స్వయం సహాయక సంఘాలకు చెక్కుల పంపిణీ

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘాలకు రూ.3కోట్ల 3లక్షల రుణాల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళలకు ఇచ్చే వడ్డీలేని రుణాలతో వ్యాపారాలు ఏర్పాటు చేసి ఆర్థిక ప్రగతిశీలత సాధించాలని ఆయన సూచించారు. మహిళలను కోటీశ్వర్లు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు ముందడుగు వేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీవో పీడీ రవీందర్ రాథోడ్, ఎంపీడీఓ వంశీకృష్ణ పాల్గొన్నారు.

మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలి

జైనథ్: ప్రభుత్వం నుంచి మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అధికారులకు సూచించారు. దీంతో మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసుకునేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. మంగళవారం సాత్నాల మండలంలోని సహస్రాండ దుబ్బగూడ గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించే కమ్యూనిటీ షెడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని అంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఇందులో బీజేపీ నాయకులు సుభాష్, రమేష్, గంగన్న, మహేశ్, రోహిదాస్, దినేష్, తదితరులున్నారు.



స్వయం సహాయక సంఘాల మహిళలకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్



శిక్షణ కలెక్టర్లను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బరంపూర్ ఆలయంలో ప్రత్యేక పూజలు

తలమడుగు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంపురం గ్రామంలో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం జిల్లాకు వచ్చిన శిక్షణ కలెక్టర్లు ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో కొండ పైన ఆలయం నిర్మించడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకొని మానసిక ప్రశాంతతతో జీవించాలని కోరారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శిక్షణ కలెక్టర్‌ను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. ఇందులో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ముడుపు కేథరీశ్వర్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ అనిల్ రెడ్డి, గజానంద్, ఆలయ పూజారి స్వస్తిక్ స్వామి, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన విద్యార్థులకు రైతు సమస్యలపై అవగాహన ఉండాలి



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న హార్టికల్చర్ ఆఫీసర్ గుడిమల్ల సందీప్‌కుమార్

ఉట్నూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పాలిటెక్నిక్ పూర్తి చేసుకున్న విద్యార్థులు పండ్ల తోటలు పండించే రైతుల సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యానవన అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్ అన్నారు. పాలిటెక్నిక్‌లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఉద్యాన కోర్సులు చదువుతున్న యువతీ, యువకులకు వివిధ ఉద్యాన పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహనకలిగి ఉన్నప్పుడే రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు. వృత్తిపరమైన నైపుణ్యం కలిగి ఉండాలని, విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని, భవిష్యత్తులో రైతులకు ఉపయోగపడే శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. గత సంవత్సరం ఉద్యాన పాలిటెక్నిక్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు ఉట్నూర్‌లోని ఐటీడీఏ ఉద్యాన నర్సరీలో వివిధ రకాల పంటల సాగు విధానాలపై అవగామన కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళి, కళాశాల సిబ్బంది సి.అశ్విని, ఎం.చాణక్య, డి.అశ్విని, మొదటి రెండవ సంవత్సర ఉద్యాన పాలిటెక్నిక్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జనవరి 23న ఆదిలాబాద్‌లో ఆదివాసీల ధర్మయుద్ధం : బాపురావు

ఉట్నూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలంటూ జనవరి 23న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివాసుల ధర్మయుద్ధం బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గుసడి గుట్టలో జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడారు. లంబడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని జనవరి 23న ఆదవాసీ ధర్మయుద్ధం సభ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మహారాష్ట్రలో యవత్మాల్‌లో లంబాడీలను ఎస్టీలో కల్పవద్దని భారీ బహిరంగ సభలో మాట్లాడడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా కృషి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఇంటి మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం నేరడిగొండ మండలంలోని రాజురా గ్రామంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీలో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 55 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, ఇందిరా మహిళ శక్తి చీరలు అందజేశారు. మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన ఊరిని, కన్నవారిని మరిచిపోకూడదని, తన స్వగ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కలీం, ఎంపీడీవో శేఖర్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, దేవేందర్ రెడ్డి, పాండు, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: తలమడుగు మండలంలోని కుచలాపూర్ గ్రామంలో నిర్వహించనున్న విఠలరుక్మిణి దేవి ఆలయ తృతీయ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మంగళవారం తన నివాసంలో ఉత్సవ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రికను వారు ఈ సందర్భంగా అందజేశారు. రాబోయే వార్షికోత్సవ కార్యక్రమ వివరాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు.

బజార్‌హత్నూర్: గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాభివృద్దే తన ధ్యేయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని దాబాడి గ్రామాన్ని మంగళవారం నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి హనుమాన్ ఆలయాన్ని దర్శించుకుని గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామానికి సమస్యగా మారిన రోడ్డుని గతంలోనే తాత్కాలిక రోడ్డు కోసం రూ.10 లక్షలు మంజూరు చేసి రోడ్డు పనులు పూర్తి చేయించామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు, బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. రెండు కోట్ల 50 లక్షలు మంజూరుకు హామీనిచ్చారని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలతో పాటు గృహాల నిర్మాణం, డ్రైనేజీ నిర్మాణం ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలుకూరి భూమన్న, మాజీ సర్పంచ్ విద్యాసాగర్, రాజారాం, కుర్మే లక్ష్మణ్, చంద్రశేఖర్, అక్షయ్ కుమార్,చ సుభాష్ జాదవ్, చందర్‌సింగ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతో ఐసీడీఎస్ నిర్వీర్యం

● సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి ఏఆర్ సింధూ ● ఆదిలాబాద్‌లో రాష్ట్ర ఐదో మహాసభలు ● కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టిన జాతీయ నేతలు ● పట్టణ ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ



ఆదిలాబాద్‌లో ప్రధాన వీధుల గుండా కొనసాగుతున్న ర్యాలీ



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి ఏఆర్ సింధూ

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించి మాతాశిశు మరణాలను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి ఏఆర్ సింధూ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఐదో మహాసభలను నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే మహాసభల్లో భాగంగా తొలి రోజైన మంగళవారం మున్నూరుకాపు సంఘ భవనం నుంచి ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా సభ స్థలి వరకు ర్యాలీ కొనసాగింది. ఎర్ర జెండాలు చేత పట్టుకొని అంగన్‌వాడీలు ఉత్సాహంగా ర్యాలీ చేపట్టారు. అనంతరం సభస్థలిలో జాతీయ, రాష్ట్ర నాయకులు అభివాదం చేసి అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యపై ప్రసంగించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి ఏఆర్ సింధూ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బలవర్ధకమైన ఆహారం అందించడానికి 1975లో ఐసీడీఎస్‌ను ప్రారంభించారని, ఇటీవలే 50 సంవత్సరాలు సైతం పూర్తయ్యాయని అన్నారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాల్సిన ప్రధాని మోదీ తన నిర్ణయాలతో ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఐసీడీఎస్ వ్యవస్థను కాపాడటంతో పాటు అంగన్‌వాడీల సమస్యల సాధనకు రాష్ట్ర మహాసభలు కేంద్ర బిందువుగా మారుతాయన్నారు. అంతేకాకుండా గడిచిన మూడేళ్ల కాలంలో సంఘం తరఫున చేసిన పోరాటాలు, ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాలు, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలోనే ఫిబ్రవరిలో జాతీయ మహాసభలు పుణె కేంద్రంగా జరుగుతాయని, అక్కడి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర నాయకులు సాయిబాబు, పాలగుడు భాస్కర్, సచిన్, సునిత, జయలక్ష్మి, దర్శనాల మల్లేష్, కిరణ్, బండారు రవి కుమార్, బండి దత్తాత్రి, వెంకటమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మోగిన నగారా..

(5వ పేజీ తరువాయి...)

ప్రభుత్వం భావిస్తుంది.

నేతల వద్దకు క్యూ

పంచాయతీ ఎన్నికలను నిర్వహించడం ఖాయమని తేలిపోవడంతో ఆశావాహులంతా నేతల వద్దకు క్యూకడుతున్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ముఖ్యనేతల మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కువ మంది నేతలు ప్రధాన పార్టీల నుంచే ఎన్నికల బరిలో దిగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇన్‌చార్జీల మద్దతుతో గెలిచే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో గ్రామం నుంచి ఐదు నుంచి పది మంది ఆశావహ నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఎందుకంటే అధికార పార్టీ నుంచి పోటీ చేసి గెలిచినా.. ఓడినా.. ప్రాధాన్యత ఉంటుందని భావిస్తున్నారు. అలాగే ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి ఎన్నికల బరిలో దిగేందుకు పోటీ పడుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా.. జిల్లాలో మాత్రం భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అన్ని పార్టీలు దీటైన అభ్యర్థుల కోసం వేట మొదలు పెట్టాయి. ఎలాగైనా మెజార్టీ స్థానాలను దక్కించుకోవాలని కాంగ్రెస్ పక్కాప్లాన్‌తో ముందుకెళ్తుండగా.. ప్రధాన ప్రతిపక్ష పార్టీలైనా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కూడా స్థానిక ఎన్నికలను సీరియస్‌గా తీసుకుంటున్నాయి.

గెలిచేందుకు పక్కాప్లాన్

రిజర్వేషన్లు కలిసి వచ్చిన వారంతా గెలిచేందుకు పక్కాప్లాన్‌తో ముందుకెళ్తున్నారు. రిజర్వేషన్లు కలిసిరాని వారు కొంత నిరాశతో కనిపిస్తున్నారు. మొదట బీసీ రిజర్వేషన్ వచ్చిన మళ్లీ రిజర్వేషన్‌లు మారడంతో చాలా మంది పంచాయతీ పోరుకు దూరమవుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో గ్రామాల్లో సందడి వాతావరణం కనిపిస్తుంది. ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లలో నేతలు నిమగ్నమవుతున్నారు. ముఖ్యంగా మందు, విందులతో పాటు నగదు పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గ్రామాల్లో విందు రాజకీయాలు ఊపందుకుంటున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో సామాజిక వర్గాల వారీగా బరిలో నిలిచేందుకు నేతలు సిద్ధమవుతున్నారు. ఈసారి పంచాయతీ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఆశావహ నేతలు సిద్ధమవుతున్నారు. గత ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థులకు మళ్లీ రిజర్వేషన్లు కలిసి రావడంతో పోటీకి సై అంటున్నారు. సానుభూతితో గెలుస్తామంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు జరిగే మండలాలు, పంచాయతీల వివరాలు..

	మండలాలు	పంచాయతీలు	వార్డులు	పోలింగ్ స్టేషన్‌లు
మొదటి విడత	ఇంద్రవెల్లి	28	236	236
	ఉట్నూర్	38	336	354
	నార్నూర్	23	198	198
	గాదిగూడ	25	196	196
	సిరికొండ	19	148	148
	ఇచ్చోడ	33	276	276
రెండో విడత	ఆదిలాబాద్	31	258	258
	మావల	03	28	28
	బేల	31	254	254
	జైనథ్	17	144	144
	సాత్నాల	17	130	130
	బోరజ్	17	138	138
	తాంసి	14	112	112
	భీంపూర్	26	196	196
మూడవ విడత	బోథ్	21	182	182
	సోనాల	12	96	96
	బజార్‌హత్నూర్	31	244	244
	నేరడిగొండ	32	252	252
	గుడిహత్నూర్	26	208	208
	తలమడుగు	29	238	238



కలెక్టర్‌కు కేక్ తినిపిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

కలెక్టర్‌ను అభినందించిన ఎస్పీ

నిర్మల్‌రూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): జల సంచాయ్ - జన భాగీదారి అవార్డును అందుకున్న కలెక్టర్ అభిలాష అభినవ్‌ను ఎస్పీ డా. జి.జానకీ షర్మిల మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను కూడా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు. జిల్లాకు ఇలాంటి ప్రతిష్ఠాత్మక అవార్డు లభించడం పట్ల ఎస్పీ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి దిశగా ఇటువంటి విజయాలు మరింత వేగం తీసుకొస్తాయని అన్నారు. మున్ముందు ఇంకా రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తూ, జిల్లా ప్రతిష్ఠను మరింత ఎత్తుకు తీసుకెళ్లేందుకు పోలీస్‌శాఖ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.

భీమన్నగుట్టను కాపాడాలంటూ రిలే నిరాహార దీక్షలు

నిర్మల్‌రూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): భీమన్నగుట్టను కాపాడాలంటూ ముదిరాజ్ కులస్థులు మంగళవారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కొంతమంది వ్యక్తులు గుట్టను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూ, జేసీబీతో మట్టి తవ్వకాలు చేపడుతున్నారని అన్నారు. కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సహా పలువురికి సమస్య గురించి వినతి పత్రాలు ఇచ్చినా చర్యలు కనిపించడం లేదని సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. భీమన్న గుట్ట తమ ఆరాధ్య స్థలమని పేర్కొన్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమంలో ప్రముఖులు, నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటకారి సాయన్న ముదిరాజ్, జిల్లా నాయకులు సుంకరి సాయి, సుంకరి రాజేష్, దొంతుల చంద్రశేఖర్, సుంకరి ఆనంద్, మొగిలి రాములు, బోదారపు నరేష్, హాజరై సంఘీభావం తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో స్పిక్‌మాకే సాంస్కృతిక మహోత్సవం

బాసర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాసర ట్రిపుల్‌ఐటీలో డిసెంబర్ 2 నుంచి 5వ తేది వరకు 4వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సమ్మేళనం, భారతీయ సాంప్రదాయ కళలకు యువతకు చేరువ చేయడంతో భాగంగా స్పిక్‌మాకే ఆధ్వర్యంలో సమ్మేళనం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లుపూర్తి చేసినట్లుగా ట్రిపుల్‌ఐటీ అధికారులు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వీసీ గోవర్ధన్, అధికారులున్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న యూనివర్సిటీ అధికారులు

'స్థానిక' ఎన్నికల్లో విజయభేరి మోగించాలి

» బీఆర్ఎస్ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్



మాట్లాడుతున్న విలాస్ గాదేవార్

భైంసా, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): పార్టీ శ్రేణులన్నీ పకడ్బందీ విధానాలతో ముందుకు సాగుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయభేరి మోగించాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్ పిలుపునిచ్చారు. మంగళవారం భైంసాలో నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలవాసులతో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియపై సమావేశం నిర్వహించి మాట్లాడారు.సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థ పాలన గురించి ప్రజలకు వివరించాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యంగా పాటుపడాలని సూచించారు. ఇందులో నియోజకవర్గ పరిధిలోని ఆయామండలాల పార్టీ ప్రతినిధులు, గ్రామ పంచాయతీ ఎన్నికల ఆశావహులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య నేర్పించాలి

» మండల విద్యాధికారి నాగేశ్వర్ రావు

నిర్మల్‌రూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను నేర్పించాలని మండల విద్యాధికారి నాగేశ్వర్ రావు అన్నారు. లీడ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ తరగతులకు ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిల్లల్లో విలువలు తరుగుతున్న ఈ సమయంలో లీడ్ ఇండియా చేస్తున్న ఈ కార్యక్రమంలో దాదాపు 60కి పైగా పోషకులు హాజరయ్యారు. ఎంఈవో పోషకులను ఉద్దేశించి మాట్లాడుతూ విలువలను పెంపొందించటంలో పోషకులు ఉపాధ్యాయులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో శ్రీవాణి పాఠశాల కరస్పాండెంట్ చంద్రగౌడ్, శాంతినికేతన్ కరస్పాండెంట్ కే.పద్మనాభ గౌడ్, లీడ్ ఇండియా కన్వీనర్ శ్రీనివాసచారి, ట్రైనర్స్ జ్ఞానేశ్వర్, అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ

కుభీర్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతర్ని గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామస్తురాలైన అంజనమ్మ రూ.6వేల విలువ గల పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్, ఉపాధ్యాయులు కత్తి నాగారావు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జూనియర్ కళాశాల విద్యార్థి ఎంపిక

కుభీర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆడె రాజు రాష్ట్ర స్థాయి వాలిబాల్ పోటీలకు ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ తెలిపారు. సిరిసిల్లా జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో భాగంగా విద్యార్థి పాల్గొననున్నారన్నారు. కాగా విద్యార్థిని ప్రిన్సిపాల్ ఆధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నిర్మల్‌రూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెల్మల ప్రభాకర్ జన్మదిన వేడుకలను టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. శీతాకాలం సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కే.రవికుమార్, రాష్ట్రకార్యదర్శి గడ్డం శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు ఎస్. మోహన్ రెడ్డి, మీరా జగదీశ్వర్, రూరల్ యూనిట్ కార్యదర్శి అజయ్ కుమార్, ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షులు వై. అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన టమాట ధర

ముథోల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టమాట ధర మళ్లీ కొండెక్కింది. 15 రోజుల వరకు రూ.30 నుంచి 35 పలికిన కిలో టమాట ధర అమాంతం కూ. 60 నుంచి రూ.70 పలుకుతోంది. సామాన్యుడికి టమాట కొనేందుకు అందడం లేదు. ఇప్పుడే టమాటలు ఇలా ఉంటే మున్ముందు ఇంకా ఎలా ఉంటాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. హోల్ సేల్‌లో రూ.50 నుంచి 55 పలుకగా పల్లెటూరులో వ్యాపారులు కిలో టమాటలు రూ. 60 నుంచి 70 విక్రయిస్తున్నారు.





మాట్లాడుతున్న ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

అభివృద్ధి పనులకు రూ.3.68 కోట్లు మంజూరు

» ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

భైంసా, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.3.68 కోట్ల నిధులు మంజూరైనట్లు ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం భైంసా పట్టణ, మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరైన నిధుల ద్వారా స్త్రీ శక్తి మహిళా సంఘ భవనాలు, ప్రభుత్వ పాఠశాలల ప్రహరీలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు చేపట్టనున్నట్లుగా వెల్లడించారు. ప్రాధాన్యతను అనుసరిస్తూ ప్రగతి బాటలు వేస్తున్నామని, ప్రజలను సమస్యలను పరిష్కరిస్తున్నామని వివరించారు. ఇందులో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఫారుఖ్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఉత్తమ్ బాలేరావ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చొద్దు



పొలాన్ని పరిశీలిస్తున్న అధికారి

సోన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరి కొయ్యలను కాల్చొద్దని, కలియదున్నాలని మండల వ్యవసాయ అధికారి జి.వినోద్‌కుమార్ సూచించారు. మండలకేంద్రంలో కాల్చిన వరి కొయ్యల పంట పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చడంతో భూసారం దెబ్బతినడమే కాకుండా పర్యావరణ కాలుష్యం కూడా ఏర్పడుతుందని తెలిపారు. దీంతో నేలలో సేంద్రియ, కార్బనం తగ్గిపోవటంతో ఎరువులను మొక్కలు తీసుకోలేవని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో జాదవ్, ఉమామహేశ్వరి, రైతులు దేవేందర్, కాంతయ్య పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగికి సన్మానం

పెంబి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెంబిలో ఎఫ్ఆర్‌వోగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న రమేష్ రావును మంగళవారం పూలమాలలు వేసి, పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రాంచందర్ శాలువాతో సన్మానించి వారికి జ్ఞాపికను అందజే శారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌వో ప్రతాప్ నాయక్, డిప్యూటీ ఆర్‌వో ఇటిక్యాల సురేందర్, ఎఫ్ఎస్‌వో తాటిగూడ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

'బాధిత కుటుంబానికి అండగా ఉంటాం'

నేరడిగొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గాజుల రాజన్న కోడలి అంత్యక్రియల్లో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని కల్పించారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ, తక్షణ సాయంగా వారికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆడే గజేందర్ వెంట మండల అధ్యక్షులు ఆడే వసంత్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

భైంసారూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం గ్రామంలో 12 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, ఇళ్లనిర్మాణం పూర్తయిన కొద్ది దశల వారిగా డబ్బులు లబ్ధిదారుల ఖాతాలలో జమ అవుతున్నాయని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో సుమారు 5 నుంచి 40 ఇందిరమ్మ ఇళ్ల వరకు మంజూ రు అయ్యాయని, పనులు కూడా జరిగి లబ్ధిదారుల ఖా తాలలో నిధులు జమ అవుతున్నాయన్నారు. లబ్ధిదారు లు ఎవరి ప్రమేయం లేకుండా మా ఖాతాలోకి డబ్బులు వస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. రేండో విడతలో కూడా మన నియోజకవర్గానికి మరో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మం జూరు అవుతాయని, అర్హులందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. ఆయనవెంట ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండీ ఫారుక్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ ఉత్తం బాలేరావు, ఏఎంసీ డైరెక్టర్ అరుణ్, దిగంబర్, గోపి, అవినాష్, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.



ఇచ్చోడ ప్రధాన రహదారిపై పడుకొని ఆందోళన చేపడుతున్న విద్యార్థులు

మాకొద్దు ఈ ప్రిన్సిపాల్

- మహాత్మా జ్యోతిబా పూలే ఇచ్చోడ విద్యార్థుల ఆందోళన
- సమస్యలను అడిగితే బెదిరిస్తున్నాడంటున్న విద్యార్థులు
- రహదారిపై పడుకొని ప్రిన్సిపాల్ మాకొద్దంటూ ధర్నా చేపట్టిన విద్యార్థులు

ఇచ్చోడ,నవంబరు,25(ఆంధ్రజ్యోతి):ఇచ్చోడ మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. సమస్యలను అడిగితే ప్రిన్సిపాల్ తిట్ల దండకాలు మొదలెడుతున్నాడని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. రోడ్డుపై అడ్డంగా పడుకొని తమ సమస్యలను ఏకరువు పెట్టారు. వివరాల్లోకివెళితే.. మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే విద్యార్థులు ప్రస్తుతం పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా ఉన్ననారాయణ తమను వేధిస్తున్నాడని రెండ్రోజుల క్రితమే ప్రిన్సిపల్ మాకు వద్దంటూ లేఖ రాసి అదే ప్రిన్సిపల్‌కు అందించారు. ఈ ఘటనతో ఆగ్రహానికి గురైన ప్రిన్సిపల్ నారాయణ విద్యార్థులనుద్దేశించి నేను పాఠశాల నుంచి వెళ్లిపోవాల్సి వస్తే మిమ్మల్ని చంపివెళ్లిపోతానని విద్యార్థుల ను బెదిరించాడు. దీంతో విసుగు చెందిన విద్యా ర్థులు మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రం లోని ప్రధాన రహదారిపై పడుకొని ఆందోళనకు దిగారు. చాలా కాలంగా ప్రిన్సిపల్ వేధిస్తున్నా డని పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులను కూడా కలవనివట్లేదని గతంలో పలుమార్లు విద్యార్థుల తల్లిదండ్రులకు మీపిల్లల టీసీ ఇచ్చి పంపిస్తానని బెదిరించాడని పిల్లలు వాపోయారు. ఈప్రిన్సిపల్ మారితే గాని మేము పాఠశాలకు వెళ్లామని రోడ్డుపై భీష్మించుకు కూర్చున్నారు. పోలీసులు పిల్లలను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి వారికి నచ్చజెప్పి పాఠశాలకు పంపించారు. దీనిపై ప్రిన్సిపల్ నారాయణను వివరణ కొరగా.. విద్యార్థులు ఎవరికి తెలియకుండా సీక్రెట్ గా ఫోన్‌లు వాడుతున్నారని..వారివద్ద నుంచి ఫోన్‌లుతీసుకున్నందుకు విద్యార్థులు అలా చేశారని..ప్రస్తుతం నేనుఏమి చెప్పలేను నాకు ఫోన్లు చాలా వస్తున్నాయి..అంటూమాట దాటేశారు. విద్యార్థులు రోడ్డెక్కిన విషయం తెలుసుకున్న పోషకులు పాఠశాలకు పెద్దఎత్తున పాఠశాలకు చేరుకున్నారు.పాఠశాలలో ఏంజరుగుతుందోనని తమ పిల్లల భవిష్యతు ఏమవుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదనకు గురయ్యా రు. పాఠశాలలోకి ఏవరిని రానివ్వమంటూ, వి ద్యార్థులు ఎవరితో మాట్లాడవద్దంటూ విషయా న్ని బయటకి రానివ్వకుంటూ జాగ్రత్తా పడ్డారు. పాఠశాల సిబ్బంది యాజమాన్యం. విద్యార్థుల తల్లిదండ్రుల ఎదుటే పాఠశాల సిబ్బంది విద్యార్థులను బెదిరిస్తున్నారని పాఠశాలకు వచ్చిన పోషకులు వారి ఆవేదనను వ్యక్తం చేశారు.

ఖానాపూర్ మండలంలో పలు ఆలయాల్లో చోరీ

- ఖానాపూర్‌లో వీరాంజనేయ శివ సాయి సమాజ్, కాంచెరు పెద్దమ్మ, జగదాంబ ఆలయాల్లో దొంగతనం
- పలుచోట్ల సీసీ కెమెరాలు ధ్వంసం, డీవీఆర్‌ల అపహరణ



కాంచెరు పెద్దమ్మ ఆలయంలో హుండీని పరిశీలిస్తున్న సీఐ



హుండీని పగులగొట్టిన దృశ్యం

ఖానాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మండలంలో ఆలయాలనే టార్గెట్‌గా దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము మధ్య సమయంలో మండల కేంద్రంలోని శ్రీ వీరాంజనేయ శివ సాయి సమాజ్, కాంచెరు పెద్దమ్మ ఆలయాలతో పాటు మండలంలోని సత్తెనపల్లిలో గల జగదాంబ ఆలయాల్లో దొంగతనం జరిగింది. ఈ మూడు ఆలయాల్లో దొంగలు హుండీలను పగులగొట్టి హుండీలలో ఉన్న నగదును అపహరించుకు పోయారు. మూడు ఆలయాలలో సైతం సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఖానాపూర్‌లోని శ్రీ వీరాంజనేయ శివసాయి సమాజ్ ఆలయంలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో పాటు డీవీఆర్‌ను సైతం అపహరించుకపోయినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేందర్, ప్రధాన కార్యదర్శి కొక్కుల ప్రదీప్ తెలిపారు. గత ఐదు నెలల కాలంగా సాయిబాబా ఆలయంలోని ప్రధాన హుండీని తెరవకపోవడంతో సుమారు రూ. 70 వేల నుంచి లక్ష రూపాయల వరకు నగదును దొంగలు అపహరించుకు వెళ్లినట్లు ఆలయ కమిటీ బృందం చెబుతోంది. దొంగతనం జరిగిన ఆలయాలను ఖానాపూర్ సీఐ అజయ్ కుమార్ పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం సభ్యులు దొంగతనం జరిగిన ఆలయాలలో దొంగల తాలూకు వేలిముద్రలు, ఇతరత్రా ఆధారాలను సేకరించారు. ఆలయ కమిటీల నుంచి ఇంకా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని లిఖిత పూర్వక ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసుకుని విచారణ చేపడతామని సీఐ అజయ్ కుమార్ తెలిపారు.

పెంబి: మండలంలోని శెట్‌పల్లి గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సోమవారం రాత్రి ఆలయంలోని హుండీ పగులగొట్టి చోరీ చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్సై హన్మాండ్లు, స్పెషల్ స్క్వాడ్ వెళ్లి వేలిముద్రలు పరిశీలించారు. చోరీకి కి పాల్పడ్డ వారిని పట్టుకుంటామన్నారు.

నార్నూర్ మార్కెట్ యార్డ్‌లో రక్షణ కరువు



ఉప మార్కెట్ యార్డ్‌లో మక్కలు తింటున్న ఆవులు

నార్నూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీ వారు మండల కేంద్రంలోని ఉపమార్కెట్ యార్డ్ మక్క కొనుగోలు చేసున్నారు. కానీ రైతులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. కవర్ షెడ్ లేక పోవడంతో ఎక్కడ పడితే అక్కడ కింద సంచులు వేయడం పట్ల చుట్టూ పక్కల కింద పడి ఉన్న మక్కలను ఆవులు, గేదెలు, పందులు తింటున్నాయి. ఇప్పటికైన జిల్లా మార్కెటింగ్ అధికారి, కార్య దర్శి సందర్శించి ఇక్కడి ఉన్న సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

క్రైం సమాచారం

కూలీని హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కూలీని చంపిన కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానాను విధిస్తూ ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్ట్ న్యాయాధికారి కుమార్ వివేక్ తీర్పును వెలువరించినట్లు లైజన్ అధికారి, ఏఎస్సై ఈశ్వర్ సింగ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా సిర్పూర్ (టీ) మండల కేంద్రంలో 2019లో రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బస్తీ జిల్లా కుకుర్దు గ్రామానికి చెందిన ఓం ప్రకాష్.. అదే గ్రామానికి చెందిన బిర్జుతో పాటు మరో ముగ్గురిని నెలల వారీగా వేతనం ఇస్తానని మాట్లాడుకుని నాలుగు నెలలు పని చేయించాడు. రెండు నెలల కూలీలు డబ్బులు ఇచ్చాడు. మరో రెండు నెలల డబ్బులు కావాలని బిర్జు అడగడంతో ఇరువురికి గొడవ జరిగింది. ఇదే క్రమంలో వంట రూమ్‌లో ఉన్నకత్తిని తీసుకొని బిర్జును ఓం ప్రకాష్ పొడిచాడు. తోటి మిత్రులు అతనిని ఆస్పత్రికి తీసుకెళ్లగా మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆర్ఎంపీ వైద్యులు తులసీదాస్ దరఖాస్తు మేరకు సిర్పూర్(టీ) ఎస్సై మధుకర్ కేసు నమోదు చేశారు. సీఐ మోహన్ కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశారు. వివిధ సెక్షన్లతో పాటు ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఏఎస్సై జాదవ్ ఈశ్వర్ సింగ్ 14 మంది సాక్షులను హాజరుపరచగా ప్రత్యేక పీపీ ముస్కు రమణ రెడ్డి విచారించి నేరం రుజువు చేయడంతో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ తీర్పు వెలువడింది.

లారీని ఢీకొని ఒకరి మృతి

భైంసారూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేల్ తరోడా గ్రామానికి చెందిన లోకండె రాజేశ్వర్(24) ప్రమాదవశాత్తు ఆగి ఉన్న లారీని ఢీకొని మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం రాత్రి కండెరాజేశ్వర్ తనమోటార్ సైకిల్‌పై బేల్‌తరోడా నుంచి భైంసాకు తన తల్లికి మందులు తీసుకొని రావడానికి వెళ్తుండగా భైంసామండలం మాంజ్రి గ్రామసమీపంలో ఒకలారీ డ్రైవర్ తనలారీని రోడ్డుపై అజా గ్రత్తగా,నిర్లక్ష్యంగా ఎలాంటి ఇండికేటర్ లేకుండా జాతీయరహదారి 161పై నిలపడంతో మృతుడికి చీకటిలో లారీ కనబడక ఆగిఉన్న లారీని కొట్టడంతో తలకు బలమైనరక్తపు గాయమైఅక్కడికక్కడే మృతిచెందాడు.మృతుడితల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

సోయా సంచుల దొంగతనం

కుభీర్,నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజురా గ్రామానికి చెందిన చిక్కాల లింగన్న యొక్క సోయాబీన్ సంచులు దొంగతనం జరిగినట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం..సోమవారం రాత్రి 8.30 గంటల సమయానికి లింగన్నకు సంబంధించిన సుమారు 100 కేజీల రూ.4200 విలువ గల సోయాబీన్ సంచులు దొంగలించడం జరిగినట్లు లింగన్న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈమేరకు కేసు ఫైల్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి గొర్ల కాపరి మృతి

నర్సాపూర్(జి), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల కారణంగా మనస్థాపానికి గురైన ఓ గొర్ల కాపరి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన నిర్మల్ జిల్లా కుస్లీ గ్రామ శివారులో చోటుచేసుకుంది. అంజనీ తాండ గ్రామానికి చెందిన చవాన్ గణేష్(50) సుమారు రెండేళ్ల క్రితం బతుకుతెరువు కోసం తన కుటుంబంతో కలిసి కుస్లీ గ్రామానికి వలనవచ్చి అక్కడే నివాసం ఉంటున్నారు. అతనుకుస్లీగ్రా మానికి చెందిన భోజన్న అనే రైతు వద్ద గొర్ల కాపరిగా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం గణేష్ తన కుమారుడి జన్మదినం సందర్భంగా ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడినట్లు తెలిసింది. ఆ మనస్థాపంతో అతను ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు.రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి నుంచి అతని కోసం గాలించడం ప్రారంభించారు. మంగళవారం ఉదయం గణేష్ కోసం వెతుకు తున్న అతని తమ్ముడు కుస్లీ గ్రామ శివారులోని పత్తి చేనులో గణేష్ పురు గుల మందు తాగి మరణించి ఉన్నట్లు గుర్తించాడు. ఈ ఘటనపై మృతుడి భార్య లలిత నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దర ఖాస్తును స్వీకరించిన ఎస్సై గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణమా లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

అనారోగ్యంతో వడూర్ మాజీ ఎంపీటీసీ మృతి

నేరడిగొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఉప్పు పోశెట్టి అనారోగ్యంతో బాధ పడుతూ మంగళవారం మృతి చెందారు.ఆయన మృతి పట్ల గ్రామస్తులు, పలు రాజకీయ పార్టీల నాయ కులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సాను భూతి తెలిపారు. పోశెట్టి అంత్యక్రియలు బుధవారం తన స్వగ్రామమైన వడూర్‌లో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆదర్శ కస్తూర్బా పాఠశాలల తనిఖీ

బోథ్,నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌తో పాటు కస్తూర్బా పాఠశాలను మంగళవారం సెక్టోరల్ అధికారి ప్రత్యూష తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాలలోని స్టోర్‌రూమ్‌ను పరిశీలించి స్టాక్ వివరాలు పరిశీలించడం జరిగింది. అనంతరం విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. హాస్టల్లో 100 మంది ఉండాల్సి ఉండగా కేవలం 42 మంది విద్యార్థులు ఎందుకు ఉంటున్నారు అనే విషయంపై ఆరా తీశారు. ఆమె వెంటకేర్‌తో పాటు ప్రిన్సిపల్ ఉన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాంతినగర్‌లోని నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆదినాథ్, వేదవ్యాస్, రాజన్న, భూమన్న, ఆలయ కమిటీ అధ్యక్షుడు మోర ఆశన్న, ప్రధాన కార్యదర్శి టింగని రమేష్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిది

నేరడిగొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోగల సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు. బోథ్ మండల కేంద్రానికి చెందిన బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఆడే గజేందర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆడే వసంత్ రావ్ కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, శ్రీరామోజీ నారాయణ మురళిగౌడ్, మాధవ్ ససాని మారుతి కుర్మే మహేందర్, భోజన్న, నాగేందర్, గజ్జల అశోక్, షేక్ అలీ, ఎండి సద్దాం, నాయకులు తదితరులున్నారు.

స్థానిక ఎన్నికల్లో భారీ మెజార్టీ అందించాలి

ఉట్నూర్,నవంబరు25(ఆంధ్రజ్యోతి):రెండేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రజల కోసం అభివృద్ధి సంక్షేమకార్యక్రమాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మహిళలు తోడు నీడగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ ఇవ్వాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమబొజ్జుపటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 100 మందికి కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళ సంఘాలలోని మహిళలందరికి ప్రత్యేక డిజైన్ రూపొందించి ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి చీరలు పంపిణీ చేస్తుందని అన్నారు. ప్రత్యేకంగా మంత్రి సీతక్క, ప్రభుత్వ కార్యదర్శి దివ్యదేవరాజన్‌ల ఆధ్వర్యంలో చీరడల డిజైన్ రూపొందించి నీలి రంగు చీరలు అందిస్తున్నామన్నారు. నీలి రంగు ఆకాశానికి ప్రతిక అని మహిళలందరు ఆకాశం అంతా ఎత్తుగా ఎదగాలన్న ఉద్దేశంతోనే ఈ నీలిరంగు ఎంపిక చేయడం జరిగిందన్నారు. మహిళ సంఘాలలో ఉన్న మహిళలందరికి చీరలు ఇవ్వడం జరుగుతుందని, ఎవరైనా సంఘాలలో లేకుంటే వారి పేర్లను సంఘాలలో నమోదుచేసి చీరలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా గృహజ్యోతి, ఆర్టీసీలో ఉచితంగా మహిళలు ప్రయాణించే విధంగా మహిలక్ష్మి పథకం, అర్హులైన వారికి రేషన్‌కార్డులు, సన్నబియ్యం పథకం లాంటివి ఇవ్వడం జరుగుతుందన్నారు. త్వరలో అర్హులైన వారికి పింఛన్లు అందించే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపట్టనుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు ప్రభుత్వం పథకాలు అమలు చేయడం లేదని ఆరోపిస్తే గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వని పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని వారికి తెలిపాలన్నారు. మొదటి దశ ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభం అయ్యాయని ఇంకా ఇండ్లు రానివారు నిరాశ చెందొద్దని రెండో జాబితాలో అర్హులైన వారందరికి ఇందిరమ్మఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్‌అమృతల్, ఏఎంసీ వైస్‌చైర్మన్ భానుజయవంతరావు,ఆర్టీఏజిల్లాసభ్యుడు దూట రాజేశ్వర్,కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్‌ఇక్బాల్, అజీముద్దీన్, దాసండ్ల ప్రభాకర్, అన్నారి,కొత్తపల్లి మహేందర్ తదితరులున్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

డీసీసీ అధ్యక్షుడికి అభినందనల వెల్లువ

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్‌కి అభినందనల వెల్లువ కొనసాగుతుంది. మంగళవారం వివిద ప్రాంతాల నుంచి తరలివచ్చిన అభిమానులు శాలువాలతో సన్మానించి మిఠాయిలు తినిపించారు. గిరిజన ప్రాంతాలకు చెందిన పటేల్ వ్యవస్థ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు, సామాజిక కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెడ్మబొజ్జుపటేల్ మట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కలిసి కట్టుగా పని చేద్దామని, అన్ని అనుబంధ సంఘాలు, కుల సంఘాలతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి, కార్యచరణ రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సామాజిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌కు చేరుకున్న ఎన్నికల సామగ్రి



ఉట్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం



మండలానికి చేరుకున్న పంచాయతీ ఎన్నికల సామగ్రి

ఉట్నూర్,నవంబరు25(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం మహిళలకు రిజర్వేషన్ చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఉట్నూర్ మండలంలో 38గ్రామ పంచాయతీలు ఉండగా మండల కేంద్రంలోని పంచాయతీ ఒకటే మేజర్ గ్రామ పంచాయతీ. 2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా అప్పటి ప్రభుత్వం ఉట్నూర్‌ను మున్సిపాలిటిగా ఉన్నతీకరించాలని భావించడంతో పంచాయతీఎన్నికలు నిలిపి వేశారు. ఆ తర్వాత ప్రజల ఉద్యమాలతో ప్రభుత్వం మున్సిపాలిటి ప్రకటన పక్కన పెట్టినప్పటికి పంచాయతీ ఎన్నికలు నిర్వహించ లేదు. ఫలితంగా గత ఏడు సంవత్సరాలుగా ఉట్నూర్ మేజర్ పంచాయతీ ప్రత్యేక అధికారుల పరిపాలనలో కొనసాగుతు వస్తుంది. ఎట్టకేలకు ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు పూనుకోవడంతో ఉట్నూర్ మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి కోసం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన లక్కీ డ్రాలో మహిళలకు రిజర్వు చేయబడింది. ఉట్నూర్ మండలలో 38 గ్రామపంచాయతీలు ఉండగా అందులో 20 గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల స్థానాలను గిరిజన మహిళ అభ్యర్థులకు రిజర్వు చేశారు. ఉట్నూర్ మేజర్ పంచాయతీతో పాటు లక్కారం, దంతనపల్లి, గోండుగూడ(జి), హస్నాపూర్, కన్నాపూర్, లక్కేటిపేట, నడ్డంగూడ, పులిమడుగు, బాబాపూర్, తాండ్ర, బీర్సాయిపేట్, చాందూరి, నాగాపూర్, సాకెర జె, శ్యాంనాయక్ తండ, టక్కుగూడ, తాండ్ర, ఉమ్రి, లింగోజితండా ఎక్స్‌రోడ్ గ్రామ పంచాయతీలలో గిరిజన మహిళ సర్పంచ్‌లు ఎన్నిక కానున్నారు. అదే విధంగా మారుమూడా,గన్‌పూర్,మత్తడిగూడ, దొంగచింత, సాలెవాడ, సాలెవాడబి; షాంపూర్, ఏందా, కుమ్మరితండా, నర్సాపూర్‌బి, నర్సాపూర్ జె, కామాయిపేట్,గంగాపూర్, హీరాపూర్, జైత్రంతండా, కుమ్మరితండా, సాకెరా వడగల్పూర్ తదితర పంచాయతీల సర్పంచ్‌ల స్థానాలు ఎస్టీ జనరల్‌గా ప్రకటించారు.

ఉట్నూర్ చేరుకున్న ఎన్నికల సామగ్రి

జిల్లా గ్రామ పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఉట్నూర్ మండల పరిషత్ కార్యాలయానికి ఎన్నికల సామాగ్రి చేరుకుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాంప్రసాద్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం కావాల్సిన నామినేషన్ పత్రాలు,విత్‌డ్రాపత్రాలు,నోటిఫికేషన్ డీస్ప్లే పత్రాల తదితర సామగ్రిని చేరవేయడంతో అధికారులు కార్యదర్శుల ఆధ్వర్యంలో సామగ్రిని సరి చేసుకుంటున్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు,తగ్గుతున్నచలి

● బజార్‌హత్నూర్‌లో అత్యల్పంగా 14.5 ఉష్ణోగ్రతలు నమోదు

ఆదిలాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగి పోవడంతో చలి తీవ్రత తగ్గుముఖం పడుతుంది. మంగళవారం జిల్లా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31.3 కాగా కనిష్ఠంగా 14.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.అలాగే అత్యల్పంగా బజార్‌హత్నూర్ మండలంలో 14.5, బేలలో 14.7, బోథ్‌లో 14.8, భీంపూర్‌లో 14.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 20 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నవంబర్ 5 నుంచి 19 వరకు తీవ్రమైన చలితో జనం వణికి పోయారు.వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో చలి ప్రభావం తగ్గుతు వస్తుంది. ఉదయం రాత్రి వేళల్లోనే కొంత చలితీవ్రత కనిపిస్తున్న మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతల ప్రభావం కనిపిస్తుంది.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బోథ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చలికాలంలో సోకే వివిధ రకాల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ నవీన్‌రెడ్డి కోరారు. మంగళవారం బోథ్ పోలీసు స్టేషన్‌లో పలు రకాల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న యువకులకు రోడ్ సేఫ్టీ సీపీఆర్ పైన తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ గురుస్వామి ఎస్సై శ్రీసాయిఫార్మసి ఆఫీసర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

తాంసిలో చీరల పంపిణీ

తాంసి,నవంబరు 25(ఆంధ్రజ్యోతి):తాంసి మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి చీరలను మంగళవారం పంపిణీ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చీరలను తీసుకునేందుకు మహిళలు బారులు తీరారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వీటిని పంపిణీ చేశారు. తాంసితో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో కూడా ఈ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఏపీఎం భగవాన్లు పేర్కొన్నారు. ఆధార్ కార్డు ఉండి డ్వాక్రా గ్రూపులో లేకున్నా చీరలను పంపిణీ చేయడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది మహేందర్, రవీందర్, పుష్ప, రమేష్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో నైరాశ్యం

సారంగాపూర్,నవంబరు 25(ఆంధ్రజ్యోతి):నైరాశ్యంఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిరాశ, నిస్పృహలు నెలకొనడం సోమవారం పలువురు నాయకులు కాంగ్రెస్‌పార్టీవీడి బీజేపీ తీర్థం పుచ్చుకోవడం గమనార్హం.గత కొంత కాల నుంచి కాంగ్రెస్ కార్యాకలాపాలలో చురుకుగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

● స్థానిక సంస్థల బరిలో నిలిచేందుకు జంకుతున్ననాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ తరుపున ఎన్నికల బరిలో నిల్చోడానికి జంకుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల స్థాయినాయకులు అధికార పార్టీలో నాయకులను పట్టించుకోవడం కారణమని నాయకులు, కార్యకర్తలు పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీల రిజర్వేషన్‌లు విడుదల అయ్యి రెండు రోజులు గడుస్తున్న బడా నాయకులు మాత్రం సర్పంచ్ పదవి బరిలో నిల్చునే అభ్యర్థుల ఎంపికను చేయక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● నామినేటెడ్ పదవులు ఉన్న పార్టీ కార్యకలాపాలకు దూరం

కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే నామినేటెడ్ పదవులను పార్టీ నాయకులకు కట్టబెట్టింది. దీంతో సారంగాపూర్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవితో పాటు అడెల్లి మహా పోచమ్మ ఆలయం చైర్మన్ పదవులను పొందిన నాయకులు కాంగ్రెస్ నిర్వహించే కార్యకలాపాలకు దూరం

● నిన్న బీజేపీ కండువా.. నేడు కాంగ్రెస్ కండువా

సారంగాపూర్ మండలం ప్రస్తుతం మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగోరావు సోమవారం కాంగ్రెస్ పార్టీని వీడి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ కండువాను కప్పుకొని 24 గంటలు గడవ ముందే సొంత గూటికి చేరుకొని కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకొని కాంగ్రెస్ పార్టీలో చేరడం గమనార్హం.

ఆత్రం సుగుణకు సన్మానం

నార్నూర్,నవంబరు 25(ఆంధ్రజ్యోతి):కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా నియామకమైన ఆత్రం సుగుణను నార్నూర్ మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఉట్నూర్‌లోని వారి స్వగృహంలో కలిసి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వ పరంగా అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరిస్తూ మెజార్టీ సర్పంచ్ స్థానాలు గెలుపు దిశగా ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మొహమ్మద్, సంతోష్, జాదవ్‌రాందాస్ పాల్గొన్నారు.






మంగళవారం ఉదయం పూట బోథ్ రోడ్ల పై కురుస్తున్న పొగమంచు - పంట పొలాలను కమ్మేస్తున్న పొగమంచు

కమ్మేసిన పొగమంచు

బోథ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):వర్షాలు తగ్గిపోవడంతో పంటలపై పొగమంచు ప్రభావం పడుతున్నది. గత రెండు రోజులుగా పొగమంచు కురుస్తుండడంతో ఉదయం పూట రోడ్లపై వాహనాలు నడిపేవారు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు.మరో వైపు పంటలపై పొగమంచు కురుస్తుండడంతో పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు అంటున్నారు. పూతదశలో ఉన్న కందిపత్తి పంటలకు పొగమంచు వల్ల నష్టం సంభవిస్తుందని రైతులు అంటున్నారు.మొన్నటి వరకు రైతులను ఇబ్బందులకు గురిచేసిన వర్షాలు పొగమంచు వల్ల రైతుల ఆందోళన చెందుతున్నారు.





కొద్ది నెలల క్రితం ఖానాపూర్ అడవుల్లో నరికి వేతకు గురైన చెట్టు (ఫైల్)

అటవీ శాఖలో సిబ్బంది కొరత

- ఖానాపూర్ డివిజనల్‌లో ఒక్కో బీట్ అధికారికి రెండు, మూడు బీట్ల బాధ్యతలు
- ఐదు రేంజ్‌ల పరిధిలో 79 బీట్లు
- 36 మంది ఎఫ్‌బీవోలతోనే అన్ని బీట్లు
- 79 బీట్లతోపాటు మూడు చెక్‌పోస్టులలోనూ తప్పని విధులు
- నరికి వేతకు గురవుతున్న అడవులు
- చెక్‌పోస్టుల వద్ద కొరవడుతున్న నిఘా

ఖానాపూర్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దట్టమైన అడవులను కలిగి ఉండే ప్రాంతాల్లో ఒకటిగా పేరున్న ఖానాపూర్ అడవుల సంరక్షణ బాధ్యత సిబ్బందికి భారంగా మారింది. ఖానాపూర్ డివిజన్ పరిధిలో ఐదు రేంజ్ కార్యాలయాలున్నాయి. ఫారెస్ట్ బీట్ అధికారుల కొరత ఉండటంతో ఒక్కో బీట్ ఆఫీసర్‌కు అదనంగా రెండు నుంచి మూడు బీట్ల విధులను అప్పగించడంతో ఆశించి నస్థాయిలో అడవుల రక్షణ కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఖానాపూర్, కడెం, ఉడుంపూర్, పెంబి, తాండ్ర అటవీరేంజ్ కార్యాలయాల పరిధిలో కొన్నిచోట్ల కలప స్మగ్లర్లు రెచ్చిపోయి అడవుల నరికివేతకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దట్టమైన అటవీ ప్రాంతమైన ఈ ఐదు అటవీరేంజ్ కార్యాలయాల పరిధిలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే బీట్ అధికారుల సంఖ్య మరింత పెంచాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరతతో అడవుల సంరక్షణలో పర్యవేక్షణ కష్టతరమవుతోందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఖానాపూర్ డివిజన్ పరిధిలో ఐదు అటవీ రేంజ్ కార్యాలయాలు ఉండగా వాటి పరిధిలో 79 బీట్లు బాధనకుర్తి, పాండ్వాపూర్, మొండిగుట్ట మూడు చెక్‌పోస్టులు ఉన్నాయి. వీటన్నింటి విధులను కేవలం 36 మంది బీట్ అధికారులతోనే అటవీశాఖ నెట్టుకొస్తోంది. ఒక్కో బీట్ ఆఫీసర్‌కు అదనంగా రెండు నుంచి మూడు బీట్లను ఇన్‌చార్జీగా కేటాయిస్తుండడంతో అడవులను పర్యవేక్షించడం సాధ్యమవడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతకొద్ది నెలల క్రితం ఖానాపూర్ అటవీరేంజ్ కార్యాలయం పరిధిలోని తర్లపాడ్ సమీపంలో నిర్మల్, మంచిర్యాల రహదాని ఆనుకుని విలువైన టేకు చెట్లను నరికేసి అటవీ అధికారులకు

నరికి వేతకు గురవుతున్న అడవులు

స్మగ్లర్లు సవాల్ విసిరారు. ఇటీవల ఉడుంపూర్ అటవీ రేంజ్ కార్యాలయం పరిధిలో సైతం కొంతమంది స్మగ్లర్లు విలువైన టేకు చెట్లను నరికేశారు. ఓవైపు అడవుల నరికివేత కొనసాగుతుండగానే చాపకింద నీరులా ఈ ప్రాంతాల్లో వన్యప్రాణుల వేట కూడా కొనసాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొద్దినెలల క్రితం సైతం ఈ ప్రాంతంలో అలుగును వేటాడిన బృందం పట్టుబడడం కలకలం సృష్టించింది. విలువైన వృక్ష సంపద అరుదైన జంతు జాతులకు నిలయమైన ఖానాపూర్ డివిజన్ పరిధిలోని అడవులలో విధులు నిర్వహించే సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమిస్తేనే ఇటువంటి స్మగ్లర్లను వేటగాళ్లను కట్టడి చేయడం సాధ్యమవుతుందని చెబుతున్నారు. అధికారులు స్పందించి ఎఫ్‌బీవోల కొరతను తీర్చి అడవులు, వన్యప్రాణులను సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.

79 బీట్లకు 36 మంది ఎఫ్‌బీవోలు

ఖానాపూర్ డివిజన్ పరిధిలోని ఖానాపూర్, కడెం, ఉడుంపూర్, పెంబి, తాండ్ర అటవీరేంజ్ కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో మొత్తం 79 బీట్లు ఉండగా ప్రస్తుతం 36 మంది బీట్ అధికారులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఉడుంపూర్ రేంజ్ పరిధిలో మొత్తం 24 బీట్లు ఉండగా ఏడుగురు ఎఫ్‌బీవోలు మాత్రమే విధుల్లో ఉన్నారు. 17 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖానాపూర్ అటవీ రేంజ్ కార్యాలయం పరిధిలో 17 బీట్లు ఉండగా కేవలం 8మంది బీట్ అధికారులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కడెం అటవీరేంజ్ కార్యాలయం పరిధిలో 14 బీట్లు ఉండగా కేవలం ఏడుగురు బీట్ అధికారులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పెంబి అటవీ రేంజ్ కార్యాలయం పరిధిలో 13 బీట్లు ఉండగా కేవలం 8 మంది బీట్ అధికారులు విధులు నిర్వహిస్తుండగా ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాండ్ర అటవీ రేంజ్ కార్యాలయం పరిధిలో 11 బీట్లు ఉండగా కేవలం ఆరుగురు బీట్ అధికారులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు లెక్కలు చెబుతున్నారు. దీంతో ఈ ఐదు అటవీరేంజ్ కార్యాలయాల పరిధిలో ఒక్కో బీట్ అధికారికి రెండు నుంచి మూడు బీట్ల చొప్పున అదనపు బాధ్యతలను అధికారులు అప్పగించారు.


అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

• కే.శివకుమార్, ఎఫ్‌డీవో, ఖానాపూర్

ఖానాపూర్ డివిజన్ పరిధిలోని ఐదు అటవీ రేంజ్‌ల పరిధిలో ఉన్న సిబ్బంది కొరతను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే ఖాళీలను భర్తీచేసేలా అధికారులు చర్యలు చేపడతారని ఆశిస్తున్నాం. ఉన్న సిబ్బందితో అడవులు, వన్యప్రాణుల సంరక్షిస్తున్నాం. సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, బేస్ క్యాంపు వాచర్లతో అడవులపై నిఘాపెట్టాం. చెట్లునరికినా, వన్యప్రాణులకు హాని తలపెట్టినా కఠిన చర్యలు తప్పవు.

మోగిన నగారా

- మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు
- జిల్లాలో 400 ఎన్నికలకు సర్వం సిద్ధం



నిర్మల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను జారీచేసింది. మూడు దశల్లో ఈ ఎన్నికలను నిర్వహించనున్నారు. మొదటిదశ ఎన్నికలు డిసెంబరు 11న, రెండో దశ డిసెంబరు 14, మూడో దశ ఎన్నికలు డిసెంబరు 17వ తేదీన నిర్వహించనున్నారు. డిసెంబర్ 11న నిర్వహించే మొదటిదశ ఎన్నికలకు సంబంధించి ఈనెల 27 నుంచి నామినేషన్‌లను స్వీకరించనున్నారు. అలాగే డిసెంబరు 14న నిర్వహించే రెండోదశ ఎన్నికలకు సంబంధించి ఈనెల 30 నుంచి నామినేషన్‌లను స్వీకరించనున్నారు. కాగా డిసెంబరు 17న నిర్వహించే మూడో దశ ఎన్నికలకు సంబంధించి అదేనెల 3నుంచి నామినేషన్‌లను స్వీకరించనున్నారు. ఇప్పటికే అధికారులు ఈ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను పూర్తిచేశారు. ఎన్నికల అధికారులకు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిచేశారు. ఇక రిజర్వేషన్‌ల ప్రక్రియ కూడా ఇప్పటికే పూర్తయిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు ఎన్నికల తేదీ ఖరారు కావడంతో ఇక ఎన్నికల నిర్వహణే మిగిలి ఉంది.

మూడు దశల్లో ఎన్నికలు

నిర్మల్ జిల్లాలోని 400 గ్రామపంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి దశలో 136, రెండో దశలో 131, మూడో దశలో 133 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరపబోతున్నారు. మొదటి దశ కింద ఖానాపూర్ మండలంలోని 25, పెంబి మండలంలోని 24, కడెం మండలంలోని 29, దస్తూరాబాద్ మండలంలోని 13, మామడ మండలంలోని 27, లక్ష్మణచాంద మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించబోతున్నారు. అలాగే రెండో దశ కింద నిర్మల్ మండలంలోని 20, సోన్ మండలంలోని 14, సారంగాపూర్ మండలంలోని 32, దిలావర్‌పూర్ మండలంలోని 12, నర్సాపూర్(జి) మండలంలోని 13, లోకేశ్వరం మండలంలోని 25, కుంటాల మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. చివరగా డిసెంబర్ 17వ తేదీన జరగబోయే మూడవ దశ ఎన్నికలకు సంబంధించి మొత్తం ఐదు మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. భైంసా మండలంలోని 30 గ్రామ పంచాయతీలు, కుభీర్ మండలంలోని 42 గ్రామ పంచాయతీలు, తానూర్ మండలంలోని 32 గ్రామ పంచాయతీలు, ముథోల్ మండలంలోని 19 గ్రామ పంచాయతీలు, బాసర మండలంలోని 10 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 400 గ్రామ పంచాయతీలకు సంబందించి సర్పంచ్ పదవులతో పాటు వార్డు మెంబర్‌ల పదవులకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి

అధికార యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లను పూర్తిచేసింది. ఇటీవలే రిజర్వేషన్‌ల ప్రక్రియ కూడా పూర్తికావడంతో ఇక ఎన్నికల నిర్వహణకు సంబంధించి చర్యలు మొదలుపెట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. దశల వారిగా ఖానాపూర్, నిర్మల్, భైంసా కేంద్రాల ద్వారా ఈ ఎన్నికలు జరిపేందుకు ఏర్పాట్లు చేపట్టబోతున్నారు. జిల్లాలోని మొత్తం 400 గ్రామ పంచాయతీలకు 186 జనరల్ కింద రిజర్వ్ కాగా 72 గ్రామ పంచాయతీలు బీ.సీలకు, 69 జీపీలు ఎస్సీలకు రిజర్వ్ కాగా, 73 గ్రామ పంచాయతీలు ఎస్టీలకు రిజర్వ్ అయిన సంగతి తెలిసిందే. 2011 జనాభా లెక్కలతోపాటు 2024లో జరిపిన బీసీల కులగణన నివేదిక ఆధారంగా రిజర్వేషన్‌లను ఖరారు చేశారు. కాగా 182 గ్రామపంచాయతీలను ఈసారి మహిళలకు రిజర్వ్ చేశారు.

చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్నా లడ్డా

భైంసా, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణించి బహుముఖ ప్రతిభావంతులుగా ఎదగాలని భైంసాకు భారత్ స్పోర్ట్స్ ఏరినా చైర్మెన్ మున్నా లడ్డా పిలుపునిచ్చారు. మంగళవారం భైంసాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శారీరక ధృడత, మానసిక చురుకుదనం, క్రమశిక్షణ పెంపొందింపచేసుకునేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు రోజు క్రమం తప్పకుండా గంట సమయాన్ని ఆటలు, వ్యాయమ సాధన కోసం కేటాయించాలని సూచించారు. నేటి పోటీతత్వ యుగం లో దీటుగా రాణించేందుకు విద్యార్థులందరూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతూ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని అకాంక్షించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణ మంజుల, హెచ్‌డబ్ల్యూవో కవితతో పాటు ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

గల్ఫ్ ఎన్నారై పాలసీ అధ్యయనంపై డిసెంబరులో జిల్లాల పర్యటన

- డిసెంబరు 3, 4న ఖానాపూర్, జన్నారం ప్రాంతాల సందర్శన

నిర్మల్‌రూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గల్ఫ్ ఎన్నారై పాలసీ రూపకల్పనలో భాగంగా గల్ఫ్ వలసలు, సమస్యలు, పరిష్కారాలపై సమగ్ర అధ్యయనం కోసం డిసెంబరులో గల్ఫ్ ప్రభావిత జిల్లాల్లో పర్యటించనున్నట్లు ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్, అంబాసిడర్ డా. బీఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీమ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ దేవాలకు వలస వెళ్లిన కార్మికులు, తిరిగి వచ్చిన ఉద్యోగులు, గల్ఫ్ ప్రభావిత కుటుంబాలతో సమావేశమై వారి అనుభవాలు, సమస్యలు, అవసరమైన సమాచారం సేకరించనున్నట్లు వారు పేర్కొన్నారు. ముందుగా ఖానాపూర్, జన్నారం ప్రాంతాల్లో డిసెంబరు 3, 4 తేదీల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ, కార్మిక, ఉపాధి, మహిళా, శిశుసంక్షేమ శాఖల అధికారులు, విద్యావేత్తలు, రిక్రూటింగ్ ఏజెన్సీలు, సామాజిక సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై అవగాహన

ముథోల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ముథోల్ మండల కేంద్రంలో మంగళవారం ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ ఆధ్వర్యంలో స్థానిక ఆశ్రమ పాఠశాలలో డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. రోడ్డుపై డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పరిసరాలను ముందుగానే గమనిస్తూ వాహనం నడపాలని సూచించారు. డిఫెన్స్ డ్రైవింగ్‌తో ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఎదుటివారి తప్పిదాలను తప్పనిసరిగా డ్రైవింగ్ చేసేటప్పుడు గమనించాలన్నారు. దీంతో ప్రమాదాల నుంచి రక్షించుకోవచ్చన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై ప్రతి ఒక్క డ్రైవర్‌కు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ పద్ధతిని వాహనదారులు తప్పనిసరిగా పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. అనంతరం ముథోల్‌లోని ప్రధాన కూడలివద్ద గల రోడ్డుపై ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై పెర్సిస్

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కడెం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. కడెం మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో సాయంత్రం కడెం పోలీసుల ఆధ్వర్యంలో యువకులను చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అంశంపై అవగాహన కల్పించారు. గంజాయి, గుట్కా డ్రగ్స్‌కు బానిసై యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ జగ్మాల్ నాయక్, కానిస్టేబుళ్లు షారుక్‌ఖాన్ ఉన్నారు.

28న జిల్లా కబడ్డీ జట్లకు ఎంపిక పోటీలు

నర్సాపూర్(జి), నవంబరు25 (ఆంధ్రజ్యోతి): బాల బాలికల విభాగాల్లో జూనియర్స్ సీనియర్స్ నిర్మల్ జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను ఈనెల 28న నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్, సెక్రటరీ బర్కుంట సునీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్(జి) ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఉదయం 9గంటలకు నల్గొండ, మహబూబ్ నగర్ (జూనియర్స్), కరీంనగర్ (సీనియర్స్)లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జట్లను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మెమో, ఎంట్రీ ఫీజు రూ.100లతో రిపోర్ట్ చేయాలని తెలిపారు. వివరాలకు 9908970203, 9059321994లకు సంప్రదించాలని పేర్కొన్నారు.





ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు

- ఘనంగా ఆలయ వార్షికోత్సవం
- బాధనకుర్తిలో జాతర
- భారీగా తరలివచ్చిన భక్తజనం

ఖానాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాధనకుర్తి గ్రామంలో గల అతిపురాతన దత్తాత్రేయ పాదుకా క్షేత్రమైన దత్తాత్రేయుని ఆలయ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా మంగళవారం ఆలయంలో పుణ్యవచనము, రక్షాబంధనము, అంకురార్పణ, సర్వతో భద్రమండలాల ఆవాహన పూజలు, స్వామివారికి నవరసాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దత్తాత్రేయుని జాతరకు నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాల వద్ద మహిళలు, చిన్నారుల సందడి కనిపించింది.



ఆలయ ప్రాంగణంలో బెల్లం తూకం వేస్తున్న భక్తులు



కడెంలో చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



దిలావర్‌పూర్‌లో ఇందిరమ్మ చీరలతో మహిళలు

ఇందిరా మహిళా శక్తి చీరలు.. మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక

కడెం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి చీరలు మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కడెం మండలంలోని కొండుకూర్ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ చీరలను అధికారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని, మహిళలకు వడ్డీలేని రుణాలు, ఉచితబస్సు ప్రయాణం, అనేక మహిళా సాధికారత అభివృద్ధి కార్యక్రమాల చేపడుతోందని అన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ విష్ణువర్ధన్, గ్రామసెక్రటరీ అరుణ్, మాజీవైస్‌ఎంపీపీ సంతోష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పెద్దిశ్రీనివాస్, సత్యంచారి, సంపత్‌రెడ్డి, జాడి లచ్చన్న, అంజన్న, భూమన్న, నారాయణ, కార్యకర్తలున్నారు.

దిలావర్‌పూర్: మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలకు మంగళవారం ఇందిరమ్మ చీరలను పంపిణీచేశారు. బన్సపల్లిలో పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి, దిలావర్‌పూర్‌లో ఐకేపీ ఏపీఎం బోసు, కాల్వలో లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ మహేందర్, కంజర్‌లో ఏఎంసీ డైరెక్టర్ నిమ్మసాయన్న ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 6,102 చీరలను పంపిణీ చేసినట్లు ఏపీఎం బోసు తెలిపారు. కేవలం డ్వాక్రా మహిళలకే ఇందిరమ్మ చీరలను పంపిణీచేసి మిగతా మహిళలను విస్మరించడం పట్ల కొంతమంది మహిళలు అసంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమాల్లో సీసీలు నామాయ ముత్యం, పోశెట్టి, సాయన్న, వీవోఏలు పాల్గొన్నారు.



కోలూర్‌లో చీరలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పారదర్శకంగా చీరల పంపిణీ: ఎమ్మెల్యే

ముథోల్: ముథోల్ నియోజకవర్గంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ పారదర్శకంగా చేపట్టాలని, ఆ బాధ్యత సంబంధిత అధికారులదేనని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో మంగళవారం ముథోల్, బాసర, తానూర్ మండలాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులకు ఐకేపీ ఆధ్వర్యంలో చీరలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన చీరల పంపిణీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో సకాలంలో చీరలను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ముథోల్, బాసర ఎంపీడీవోలు లవన్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, ఏపీఎంలు గురుచరణ్, అశోక్, సులోచన, ఎంపీవోలు గంగాసింగ్, అమీర్ ఖాన్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు నర్సాగౌడ్, సాంవ్లీ రమేష్, వెంగళ రావు, సతీష్ రెడ్డి, తాటివార్ రమేష్, లడ్డు పోతన్న, మహేందర్ రెడ్డి, కిష్టయ్య, శ్రీనివాస్, దేవోజీ భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

తానూర్: మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం మహిళా శక్తి చీరలను పంపిణీ ప్రారంభించారు. స్థానిక మాజీ సర్పంచ్ నాయకులతో కలిసి ఈ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కాంతాల చంద్రకళ, శ్రీనివాస్‌రెడ్డి, ఎం. శంకర్, నాయకులు తదితరులున్నారు.